కెసిఆర్ అసెంబ్లీకి రావాలి

- ప్రజాసమస్యలపై సర్కార్‌కు సూచనలివ్వాలి
- 10 నెలల్లో 50 వేల ఉద్యోగాలిచ్చాం
- త్వరలో కొత్త రవాణా పాలసీ
- ఎంవిఐలకు నియామక పత్రాల అందజేత కార్యక్రమంలో సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రధాన ప్రతిపక్ష నేతగా కెసిఆర్ అసెంబ్లీకి వచ్చి, ప్రజాసమస్యల పరిష్కారానికై ప్రభుత్వానికి సలహాలు, సూచనలివ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని ఆర్‌టిఎ ప్రధాన కార్యాలయంలో కొత్తగా ఎంపికైన మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లకు (ఎఎంవిఐ) నియామక పత్రాలను సిఎం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 10 నెలల్లో తెలంగాణ ఏదో కోల్పోయిందంటూ ఫాంహౌస్‌లో ఉన్న ఓ పెద్ద మనిషి ఏదేదో మాట్లాడుతున్నారని కెసిఆర్‌నుద్దేశించి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. కెసిఆర్ ఇంట్లో నలుగురు ఉద్యోగాలు కోల్పోయారే తప్ప తెలంగాణ ప్రజలు కోల్పోయిందేంలేదని అన్నారు. "నిరుద్యోగులు ఉద్యోగాలు పొందారు, రైతులు రైతు రుణమాఫీతో రుణ విముక్తులయ్యారు.కోటి ఐదు లక్షల మంది మహిళలు ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణంతో లబ్ధి పొందారు.నష్టాల్లో కూరుకున్న ఆర్టీసీ లాభాల బాటలో పయనిస్తోంది. 49 లక్షల 90వేల కుటుంబాలు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వినియోగించుకుంటున్నాయి. రూ.500లకే ఆడబిడ్డలు వంటగ్యాస్ సిలిండర్ అందుకోగలుగుతున్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10లక్షల వరకు ఉచిత వైద్యం అందుకోగలుగుతున్నారు. పదేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో నిరుద్యోగుల ఆకాంక్షలు నెరవేరలేదు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఒక్కో చిక్కుముడి విప్పుతూ పది నెలల్లో 50వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశాం. గతేడాది డిసెంబర్ 7న మేం బాధ్యతలు తీసుకున్న ఎల్బీ స్టేడియంలోనే నియామక పత్రాలు అందించి నిరుద్యోగుల తల్లిదండ్రుల కండ్లల్లో ఆనందం చూశాం. ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న 35వేల టీచర్ బదిలీలు పూర్తి చేసిన ఘనత ప్రజా ప్రభుత్వానిది.

ఎంవిఐలకు నియామక పత్రాల అందజేస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి

.కేసీఆర్ వాస్తు కోసం సచివాలయం, ప్రగతి భవన్ కట్టుకోగా, మా ప్రభుత్వం 100 నియోజవర్గాల్లో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఎన్ని అడ్డంకులు సృష్టించినా 563 గ్రూప్-1 ఉద్యోగాలకు విజయవంతంగా పరీక్షలు నిర్వహించాం. త్వరలో నియామకపత్రాలు అందించి వారిని తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములను చేస్తాం" అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. "మీరు లేకపోయినా ఏం బాధలేదు. మీతో ప్రజలకేం పనిలేదు. తెలంగాణ సమాజం మరిచిపోయింది. ఇప్పటికైనా మీలో మార్పు రావాలి. ప్రభుత్వం చేసే మంచి పనులకు మద్దతు ఇవ్వండి" అని కెసిఆర్‌కు సూచించారు.

యువత మత్తు పదార్థాల వైపు వెళ్లకుండా చూడాలి

విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలైతున్నారనీ, వారిని గాడిలో పెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ముఖ్యమంత్రి ఈ సందర్భంగా తెలిపారు. రాష్ట్రంలో కొంత మంది వ్యక్తులు ఫాంహౌసుల్లో డ్రగ్స్ మత్తులో దీపావళి జరుపుకుంటున్నారని విమర్శించారు. వాటిని అరికట్టేందుకు పోలీస్ శాఖతో కలిసి రవాణా శాఖ తన వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. "కొత్తగా ఎంపికైన ఎంవీఏలకు ఈ వేదికగా సూచన చేస్తున్నా. మీ గ్రామంలో విద్యార్థులు, నిరుద్యోగులతో మాట్లాడండి. పోటీపరీక్షలకు సిద్ధమయ్యేలా స్ఫూర్తి నింపండి. చదువుకుంటేనే గుర్తింపు, గౌరవం వస్తుందని వారికి విశ్వాసం కల్పించండి. ప్రభుత్వంపై నమ్మకం పెంపొందించండి" అని సీఎం వారికి దిశానిర్దేశనం చేశారు. హైదరాబాద్ కాలుష్య నగరంగా మారిపోతుందని ముఖ్యమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. నగరాన్ని కాపాడేందుకు మూసీ పునరుజ్జీవం కార్యక్రమం చేపట్టామని పేర్కొన్నారు. ఆర్టీసీలోని పాత బస్సులను ఇతర జిల్లాలకు పంపించి 3వేల కొత్త ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తేనున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో త్వరలో కొత్త రవాణా పాలసీని తీసుకు రానున్నట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్ , రవాణాశాఖ కమిషనర్ ఇలంబర్తి, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, జాయింట్ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్లు సి.రమేష్, మమతా ప్రసాద్, డిటిసిలు శివలింగయ్య, చంద్రశేఖర్‌గౌడ్, తెలంగాణ రవాణా శాఖ టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పి. రవీంద్ర కుమార్, శ్రీనివాస్ రెడ్డి, ఆర్‌టిఒలు, ఎంవిఐలు, ఎఎంవి ఐలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు

- అవసరమైతే వ్యాపారులపై ఎస్మా ప్రయోగించండి : సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులను ఇబ్బందిపెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అవసరమైతే ఇబ్బందులకు గురిచేసే వ్యాపారులపై ఎస్మా ప్రయోగించాలని సూచించారు. రాష్ట్రంలో పలుచోట్ల రైతులను మార్కెట్లలో వ్యాపారులు ఇబ్బందులకు గురి చేస్తున్న ఘటనలు దృష్టికి రావడంతో సోమవారం సిఎం స్పందించారు. సంబంధిత శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడారు. రైతులు పండించిన పంట ఉత్పత్తుల కొనుగోళ్లలో మోసాలకు పాల్పడటం, రైతులను గందరగోళానికి గురి చేయటం, రైతులను వేధించటం లాంటి ఘటనలపై కఠినంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. రాష్ట్రమంతటా ధాన్యం కొనుగోళ్లు సాఫీగా జరిగేలా అన్ని జిల్లాల కలెక్టర్లు తగిన చర్యలు తీసుకోవాలనీ, ఎక్కడైనా ఇబ్బందులుంటే వెంటనే ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కరించాలని సూచించారు.

అధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న బక్కి వెంకటయ్య

ఎస్‌సి, ఎస్‌టి కేసుల పరిష్కారంలో సత్వర చర్యలు చేపట్టాలి

- రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

ప్రజాశక్తి - హైదరాబాద బ్యూరో

ఎస్‌సి, ఎస్‌టి కేసుల పరిష్కారంలో అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని, 15 రోజుల్లో పరిష్కరించి వాటి నివేదిక అందజేయాలని తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల కమిషన్ చైర్మెన్ బక్కి వెంకటయ్య అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో భూ, అట్రాసిటీ సమస్యలపై రెవెన్యూ, పోలీసు, సాంఘిక సంక్షేమ, ఇతర శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. వరంగల్ కమిషనరేట్ పరిధిలో నమోదైన అట్రాసిటీ కేసులు, వాటి పురోగతి వివరాలను డిసిపిలు రవీందర్, సలీమా, ఎసిపిలు తిరుమల్, దేవేందర్ రెడ్డి, తిరుపతి, కిషోర్ కుమార్ కమిషన్ చైర్మెన్ దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఎస్‌సి, ఎస్‌టిలకు సంబంధించిన పలు భూ సమస్యలు, అట్రాసిటీ కేసుల గురించి వివరించారు. భూ సమస్యలు, అట్రాసిటీ కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కమిటీ సభ్యులు చైర్మన్‌ను కోరారు. అలాగే, భూ వివాదాలకు సంబంధించిన కేసులు, అట్రాసిటీ కేసుల పరిష్కారం ఎన్ని రోజుల్లో జరుగుతుందని, ఎంతమంది బాధితులకు పరిహారం అందిందన్న వివరాలను చైర్మెన్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ.. హసన్‌పర్తి మండలం మునిపల్లిలో దళితుల భూమి సమస్యపై వారం రోజుల్లో నివేదికను అందజేయాలన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాలను తప్పనిసరిగా నిర్వహించాలని తెలిపారు. ప్రతి నెలా చివరివారంలో సివిల్ రైట్స్ డే తప్పకుండా నిర్వహించాలని, దానికి అన్ని కులాలు హాజరయ్యేలా చూడాలని కలెక్టర్‌కు సూచించారు. సివిల్ రైట్స్ డే.. సందర్భంగా ప్రజలకు భూ సమస్యలు, మూఢనమ్మకాలు తదితర సామాజిక అంశాలపై అవగాహన కల్పించాలని అన్నారు. ఎస్‌సి, ఎస్‌టి కేసుల బాధితులకు పరిహారం అందేలా సిఎం దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ రాజ్యాంగబద్ధమైనదని, బాధితులకు కమిషన్ అండగా ఉంటుందని స్పష్టంచేశారు. ఎస్‌సి, ఎస్‌టి స్టడీ సర్కిల్స్‌లో వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే యువతకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ నెల 18న ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రులను కలిసి ఎస్‌సి, ఎస్‌టి కేసులపై మాట్లాడనున్నట్టు చెప్పారు. వివిధ సమస్యలపై పోలీస్ స్టేషన్లకు వచ్చే ఎస్‌సి, ఎస్‌టిల సమస్యలను పోలీసులు ఓపికగా వినాలని, కేసుల తీవ్రతను బట్టి స్టేషన్ బెయిల్ ఇవ్వాలని పోలీసు శాఖకు సూచించారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. జిల్లాలో నమోదైన మొత్తం 21 కేసులపై తహసీల్దారుల నుంచి ప్రాథమిక నివేదికలు అందాయని, వాటిపై 15 రోజుల్లో సమగ్ర నివేదికను కమిషన్‌కు అందజేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వైవీ.గణేష్, రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ సభ్యులు నునావత్ రాంబాబు నాయక్, రేణికుంట్ల ప్రవీణ్‌కుమార్, జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు పుట్ట రవి, జవహర్‌లాల్ నాయక్, చుంచు రాజేందర్, రడపాక పరంజ్యోతి, సింగారపు రవి ప్రసాద్, వివిధ శాఖల అధికారులు, తహసీల్దార్లు, ఎస్‌సి, ఎస్‌టి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

14న ఎల్బీస్టేడియంలో 15 వేల మంది పిల్లలతో బాలల దినోత్సవం

- ముఖ్యఅతిథిగా హాజరు కానున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఈనెల 14నభారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో 15 వేల మంది విద్యార్థులతో బాలల దినోత్సవాన్ని జరపాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యఅతిథిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరు కానున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను విద్యాశాఖ, వివిధ గురుకులాల అధికారులు పరిశీలిస్తున్నారు. ఎస్‌సి గురకులం నుంచి 2,500 మంది, ఎస్‌టి గురుకులం నుంచి 2,500 మంది, బిసి గురకులం నుంచి 2,500 మంది, మైనార్టీ గురుకులం నుంచి 2,500 మంది చొప్పున నాలుగు గురుకులాల నుంచి పది వేల మంది విద్యార్థులు హాజరు కానున్నారు. పాఠశాల విద్యాశాఖ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, కెజిబివిలు, మోడల్ స్కూళ్లు, తెలంగాణ గురుకుల విద్యాలయాల సంస్థ నుంచి ఐదుమంది విద్యార్థులు వస్తారు. ఏయే పాఠశాలలు, విద్యాసంస్థల నుంచి ఈ సభకు రావాలనే విషయంపై ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నారు. రవాణా సౌకర్యం, ఇతర ఏర్పాట్లను ప్రత్యేకంగా . ఇటీవల సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు సంబంధించి మెస్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలను రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విషయం తెలిసిందే. ముఖ్యమంత్రికి విద్యార్థులు కృతజ్ఞత చెప్పేందుకు ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తున్నట్టు తెలిసింది. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, విద్యాశాఖ అధికారులు, అన్ని గురుకులాల కార్యదర్శులు పాల్గొంటారు.

సమగ్ర కుటుంబ సర్వేలో 21 రకాల వైకల్యాలకు చోటెక్కడ..?

- వైకల్య రకాల కోడ్‌లు లేకుండా ముద్రించిన సర్వే పత్రాన్ని మార్చాలి
- ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. అడివయ్య
- వికారాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో 21 రకాల వికలాంగుల వివరాలు నమోదు చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం. అడివయ్య డిమాండ్ చేశారు. వైకల్య రకాల కోడ్‌లు లేకుండా ముద్రించిన సర్వే పత్రాన్ని మార్చాలని ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఎన్‌పిఆర్‌డిఓ

ధర్నాలో పాల్గొన్న అడివయ్య

వికారాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం అడిషనల్ జాయింట్ కలెక్టర్ సుధీర్‌కి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా అడివయ్య మాట్లాడుతూ.. కుటుంబ యజమాని, కుటుంబ సభ్యుల వ్యక్తిగత వివరాలు సేకరించడానికి పార్ట్-1 ఫారంలో 13వ నెంబర్ కాలమ్‌లో వికలాంగులు అని అడిగారని అన్నారు. 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం 21 రకాల వైకల్యాలను గుర్తించిందని, సర్వే పత్రంలోని కాలమ్ 13లో కోడ్ నింపడానికి, షెడ్యూల్ నింపడానికి సూచనలు పేరుతో ప్రత్యేకంగా హ్యాండ్ బుక్ ఇచ్చారని తెలిపారు. కానీ హ్యాండ్ బుక్‌లో వికలాంగుల వివరాలు సమగ్రంగా లేవని అన్నారు. సకలాంగులకు, కులాలకు ఇచ్చిన ప్రాధాన్యత వికలాంగులకు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. గత ప్రభుత్వం వికలాంగుల గురించి ఏనాడు పట్టించుకోలేదని, మార్పు తెస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కూడా గత ప్రభుత్వం బాటలోనే నడుస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వే పత్రంలో వికలాంగుల వివరాలు (వైకల్య రకాలు) లేకుండా ప్రింట్ చేయడం అంటే వికలాంగుల పట్ల వివక్ష చూపడమేనని అన్నారు. 21రకాల వైకల్యాల కోడ్‌లను వెంటనే చేర్చి సర్వే కొనసాగించాలని కోరారు. దీనిపై సర్వేకు వస్తున్న సిబ్బందిని నిలదీయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు జె.దశరథ్, కార్యదర్శి ఆర్.శంకర్, రాష్ట్ర కమిటీ సభ్యులు సావిత్రి, మురారి, జిల్లా నాయకులు గణేష్, సలీం, కిష్టయ్య, మారుతి, అనంతలక్ష్మి, రాజు వెంకటయ్య, నారాయణ, ప్రియాంక, భీమయ్య, ఆనంద్, గోపాల్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బిజెపికి బి టీమ్‌గా కెసిఆర్ అండ్ కో

- కులగణనను అడ్డుకుంటున్న బిఆర్‌ఎస్‌ను బిసి సంఘాలు నిలదీయాలి
- అందుకే ప్రజా ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం
- ధర్నాచౌక్‌ను ఎత్తేసినోళ్లు ధర్నాలకు దిగడం విడ్డూరం : మంత్రి సీతక్క

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కేసుల నుంచి తప్పించుకునేందుకు మహారాష్ట్రంలో బిజెపికి బిటీమ్‌గా కెసిఆర్ అండ్ కో పనిచేస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క) విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆమె మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ నిర్వహించారు. కుల గణన కోసం వచ్చే అధికారులను నిలదీయాలని కేటీఆర్ పిలుపు ఇవ్వడాన్ని తప్పుబట్టారు. కులగణనను అడ్డుకునేలా వ్యవహరిస్తున్న బీఆర్‌ఎస్‌ను బీసీ, కుల సంఘాలు నిలదీయాలని విజ్ఞప్తి చేశారు. కుల గణనను అడ్డుకుంటే బిఆర్‌ఎస్ బిసి ద్రోహిగా మిగలటం ఖాయమని హెచ్చరించారు. సామాజిక తరగతుల వారిగా జనాభా లెక్క తేలితేనే సంక్షేమ వాటా సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. సర్వేను బహిష్కరించడమంటే తమ హక్కులను, అభివృద్ధిని వదులుకోవడమే అవుతుందని చెప్పారు. క్లబ్బులు, పబ్బులు బంద్ అయ్యాక కొందరు నేతలు అరాచకంగా తయారయ్యారనీ, విజ్ఞత లేకుండా ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఒక్క కెసిఆర్ కుటుంబానికి తప్ప ఎవ్వరికీ లబ్ధి చేకూరకూడదనే ఉద్దేశంతోనే ఇంటింటి సర్వేను బీఆర్‌ఎస్ అడ్డుకుంటున్నదని విమర్శించారు. ఉచిత బస్సు ప్రయాణంపై తప్పుడు ప్రచారం చేస్తూ ఆటో డ్రైవర్లను ఉసిగొల్పడాన్ని తప్పుబట్టారు. ఓలా, ఊబర్ క్యాబ్లు, బైక్ టాక్సీలకు ప్రగతి భవన్‌లో పచ్చా జెండాలు ఊపి ప్రారంభించినప్పుడు ఆటో డ్రైవర్లు గుర్తుకు రాలేదా అని కెటిఆర్‌ను ప్రశ్నించారు. గత ప్రభుత్వం రుణ మాఫీ చేయకపోవడంతో ఎంతో మంది రైతులను బ్యాంకులు బ్లాక్ లిస్టులో చేర్చడం, పలు సాంకేతిక సమస్యల కారణంగా మిగిలిన రైతులకు రుణ మాఫీ ఆలస్యమవుతోందన్నారు. రుణమాఫీని బరాబర్ చేసితీరుతామన్నారు. 50 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ అందిస్తున్నట్టు చెప్పారు. ఒక్కో గ్యారంటీని నెరవేర్చుకుంటూ పోతామని స్పష్టం చేశారు. గూడు లేని పేదలకు రూ. 5 లక్షలతో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తుందన్నారు. గత ప్రభుత్వం చేసిన రూ. 7 లక్షల కోట్ల అప్పులకు ఇప్పటికే రూ. 54 వేల కోట్లు చెల్లించాల్సి వచ్చిందన్నారు. బిఆర్‌ఎస్ హయాంలో తాలు, తరుగు పేరుతో రైతులను నిండా ముంచిన మిల్లర్ల పట్ల తాము కఠినంగా వ్యవహరిస్తుంటే...మిల్లర్లతో కుమ్మక్కైన బిఆర్‌ఎస్ రాష్ట్రంలో అలజడి సృష్టించే ప్రయత్నాలు చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిఆర్‌ఎస్ పాలనలో ఏనాడూ సీఎం, మంత్రులు సచివాలయానికి రాలేదని గుర్తుచేశారు. తాము మాత్రం నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటున్నామని తెలిపారు. గత ప్రభుత్వ పెద్దలు ప్రభుత్వ సొమ్ముతో ఇతర రాష్ట్రాల్లో రాజకీయ పర్యటనలు చేస్తే..తాము మాత్రం రాజ్యాంగ పరిరక్షణ కోసం, కుల గణన కోసం పనిచేసే శక్తుల విజయాన్ని కాంక్షించి సొంత ఖర్చులతో ప్రచారం చేస్తున్నామని చెప్పారు.

సర్వేలో 'సంచారుల' విస్మరణ

- రాష్ట్రంలో 52 సంచార కులాలకు తీవ్ర అన్యాయం
- దశాబ్దాలుగా ప్రత్యేక గుర్తింపునకు నోచుకోని సంచార జాతులు
- ప్రశ్నార్థకంగా కేంద్ర ప్రభుత్వ నిధులు..
- తిరిగి సంచార, అర్ధ సంచార, డి నోటిఫైడ్ కాలం చేర్చాలని డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలో సంచార జాతులకు దశాబ్దాలుగా అన్యాయం జరుగుతూనే ఉంది. విద్య, ఉపాధి, ఆర్థిక, రాజకీయ అంశాల్లో షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల కంటే సమాజంలో అత్యంత అధ్వాన స్థితిలో ఉన్న సంచార జాతుల పట్ల దశాబ్దాలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తూనే ఉన్నాయి. తాజాగా రాష్ట్రంలో కుటుంబ సమగ్ర సర్వే పేరిట బిసి కులగణనకు అధికార యంత్రాంగం కసరత్తు పూర్తి చేసింది. బిసి కులగణనతో పాటు సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయాలకు సంబంధించిన అంశాలు, సంచార, అర్ధ సంచార డీనోటిఫైడ్ కులాలకు సంబంధించి 45వ కాలమ్ ఏర్పాటు చేయడంపై సంచారజాతి కులాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. తమ కులాలను సోషల్ మీడియా ద్వారా 45వ కాలమ్ గురించి వివరించి సంచార కులాల జాబితాలో చేర్చుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమాన్ని భవిష్యత్తులోనైనా పొందాలని ఆకాంక్షించుకున్నారు. కానీ తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఆ సంచార కులాల ప్రజల ఆశలపై నీళ్లు చల్లుతూ 45వ కాలమ్‌ను తొలగించి కొత్త నమూనా దరఖాస్తును తయారు చేయడంతో వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బిసి కులాల్లోనే రిజర్వేషన్లను సంచార జాతులకు అందకుండా బిసిలోని అగ్రకులాలు దశాబ్దాలుగా పొందుతూ వస్తున్నారు. అల్ప సంఖ్యాకులుగా ఉన్న సంచార జాతి కులాలను రాష్ట్ర ప్రభుత్వం సైతం చిన్నచూపు చూస్తూ కాలమ్‌ను చేర్చి తొలగించడంపై ఆ కులాల ప్రతినిధుల్లో పలు అనుమానాలకు తావిస్తోంది. కాగా, బిసిలోని పలు గ్రూపుల్లో దాదాపు 52 సంచార జాతి కులాలు ఉన్నాయి. అలాగే బిసి -ఈ గ్రూప్‌లో 14 సంచార ముస్లిం కులాలు ఉన్నాయి. ఈ సర్వే ద్వారా ప్రభుత్వానికి సర్వే ఫారమ్‌లోని కాలమ్ నెంబర్ 45 ద్వారా వీరి జనాభా ఆర్థిక రాజకీయ సామాజిక స్థితిగతులు తెలుస్తాయని

భావించారు. కానీ సర్వే ఫారమ్ నుంచి ఆ కాలమ్ తొలిగించి సంచార జాతి కులాల ఉనికిని కాలరాస్తున్నారని సంచార కులాల ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంచార జాతి కులాలకు సంక్షేమం కోసం ప్రత్యేకంగా కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు ప్రశ్నార్థకంగా మారనున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి తిరిగి చేర్చాలని సంచార జాతి కులాల నాయకులు, ప్రజలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

రాష్ట్రంలో 52 సంచార కులాలు

ఎంబీసీ కార్పొరేషన్‌లో 35 కులాలు ఉన్నాయి. అవి.. బాలసంతు, బహురూపి, బుడబుక్కల, దాసరి, దొమ్మర, గంగిరెద్దులవాళ్ళు, జంగం జోగి, మొండివాళ్లు, మొండిపట్ట, మొండిబండ, వంశరాజ్, పాముల, పార్థి, నక్కల, పంబాల, పెద్దమ్మల్లోళ్లు, వీరభద్రయ, గుడాల, కంజెరబట్ట, రెడ్డిక, నేక్కార్, పరికిముగ్గుల, యాట, చోపేమారి, కైకడి, జోషి నందివాళ, మందుల, కూనపులి, పట్ర, పాలఏకరి, రాజన్నల, గోత్రాల, బుక్క అయ్యవారు, కశికాపాడి, సిద్దుల. కాగా, ఏడు దశాబ్దాలుగా ఎటువంటి గుర్తింపు పొందకుండా 2020లో కొత్తగా రాష్ట్ర ప్రభుత్వం బిసి-ఎ జాబితాలో చేర్చిన సంచార జాతి కులాలు 13. అవి.. పరంవారు, ఆద్దమువారు, బాగోతుల, బైలిప్పమ్మరి, ఏనుటి, గంజికూటివారు, గౌడజెట్టి, కాకిపడగల, మాసాయ్యలు, ఓడ్, శ్రీశత్రియరామజోగి, తేరాచీరాల, తోలుబొమ్మలాటవారు. అలాగే ఫెడరేషన్స్‌లలో ఉన్న నాలుగు కులాలు ఉండగా, అవి.. వడ్డెర, పూసల, మేదరి, బోయ.

బిసి-ఇ గ్రూప్‌లో ఉన్న పేద ముస్లిం కులాలు.. అచ్చుకట్లవాండ్లు, సింగలి, సింగంవాళ్లు, అచ్చుపనివాళ్లు, అత్తరు సాయిబులు, అత్తరోళ్ల దోభీ ముస్లిం, ముస్లిమ్ రజకులు ఫకీరు, ఫకీరు బుడ్‌బుడ్కి, గంటా ఫకీర్లు, దర్వేష్ ఫకీర్ గారడీ సాయిబులు, పాముల వాళ్లు, కనికట్టు వాళ్ల గోసంగి ముస్లిమ్, పకీరుసాయిబులు, ఎలుగుబంటు వాళ్ల, ముసల్మాన్ కీలుగుర్రల వాళ్ల హజమ్, నాయి ముస్లిమ్, నవీద్ లబ్బి, లబ్బాయి, లబ్బన్, లబ్బ పకీరియా, బోరెవాలె, డేరా ఫకీర్లు, బొంతే వాలే, ఖురేషి,ఖసబ్, మరాఠి ఖసబ్, ముస్లిం కటిక. షైక్, షేక్ షేక్. సిద్ధి, యాబ, హబ్షి, జసి తురక కాశ, జింకసాయిబులు, చక్కిటకానెవాలె (రోళ్లకు కక్కు కొట్టేవారు), పట్టర్ పోడులు.

మా కులాల భవిష్యత్తుతో ఆడుకోవద్దు : జాదవ్ శరత్, ఎఐడిఎన్‌టి జిల్లా అధ్యక్షులు, ఓడ్ కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నిజామాబాద్,

దశాబ్దాలుగా అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న సంచార జాతుల భవిష్యత్తుతో ఆడుకుంటే ప్రభుత్వాల, పార్టీల భవిష్యత్తును తలకిందులు చేసేందుకు వెనుకాడబోం. సంచార జాతులను అల్పసంఖ్యాకులుగా భావించి కేవలం ఎన్నికల దృష్టితో చూస్తూ సమాజంలో తీవ్ర అన్యాయానికి గురి చేస్తున్నారు. స్వాతంత్రానంతరం బిసిల పేరుతో, బిఆర్‌ఎస్ పార్టీ హయాంలో ఎంబిసి పేరుతో సంచార జాతులకు తీవ్ర అన్యాయం జరిగింది. ఇప్పటికైనా సంచార జాతులను ప్రత్యేకంగా గుర్తించే విధంగా కాలమ్‌ను కొనసాగిస్తూ భవిష్యత్తులో సంక్షేమ పథకాలను అందించాలి.

సర్వే నమూనాలో కాలమ్ 45ను ఎందుకు తొలగించారో చెప్పాలి తిప్పిరి శెట్టి శ్రీనివాస్, సంచార జాతుల రాష్ట్ర అధ్యక్షులు

బిసి కుల గణన నమూనాలో సంచార, అర్ధ సంచార, డినోటిఫైడ్ కాలమ్ 45ను చేర్చి తిరిగి ఎందుకు తొలగించారో సంచార జాతులకు రాష్ట్ర ప్రభుత్వం, అధికార యంత్రాంగం చెప్పాలి. విద్య, ఉపాధి, ఆర్థిక, రాజకీయ అంశాలతో ముడిపడి ఉన్న సంచార జాతుల కులగణన ఎంతో అవసరం. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ప్రత్యేకంగా సంచార తెగల గణన కమిషన్‌లు ఏర్పాటు చేస్తుంటే రాష్ట్రంలో గుర్తించి తొలగించడం అంటే సంచారజాతులను చులకన చేయడమే అవుతుంది. వెంటనే సంచార తెగల కాలమ్‌ను ఏర్పాటు చేసి సర్వేను కొనసాగించాలి.

IN THE COURT OF THE HONORABLE JUNIOR CIVIL JUDGE, KAMALAPURAM
O.S.No. 102 / 2023

Sareddy Narayanamma. ...Plaintiff
Vs
Sareddy Leelavathi, wife late Sareddy Nageswara Reddy, aged about 34
2) Sareddy Rishik Reddy, son of late Sareddy Nageswara Reddy, aged about 15 years, minor,
3) Sareddy Varsha Sri, D/o late Sareddy Nages wara Reddy, aged about 13 years,
Minor, Defendants No. 2 and 3 are minors Rep. by their natural Guardian mother namely Sareddy Leelavathi,
All are residing at Plot No.3E, Roark Green Vista Apartment, Sanjeevani Hills, Nalanda Nagar, Rajendra Nagar, Rangareddy District.. ...Defendants

SUMMON

పై నెంబరు దావాలోని ప్రతివాదులు అయిన మీకు దావా సమను తీసుకొనుటకు రాజశ్రీ కోర్టు వారు ఉత్తర్వు చేసివున్నారు. అట్టి ఉత్తర్వు మేరకు మీరు గాని మీ వకీలు ద్వారా గాని రాజశ్రీ కోర్టు యెదుట హాజరు ఆగుటకు 06.12.2024వ తేదీన ఉదయం 10.30 గంటలకు వాయిదా వేసివున్నారు. మీకు ఆక్షేపణలు వున్న యెడల తెలుపుకొనవలసినది, లేని యెడల రాజశ్రీ కోర్టు వారు మిమ్మల్ని పరోక్షముగా తీర్మానించబడును.

వాయిదా తేదీ : 06-12-2024
స్థలము : కమలాపురం
//వాది తరపున న్యాయవాది//
PALAGIRI RAJESWARA REDDY, B.A., B.L.,
Advocate, Kamalapuram.

మహారాజశ్రీ పొదిలి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఐ.ఏ. నెంబర్ : 1676/2022
ఇన్
ఓ.ఎస్.నెంబర్ : 344/2022

కందుల రామకృష్ణ ... పిటీషనర్/వాది
వర్సెస్
కందుల లక్ష్మీ రెడ్డి ... రెస్పాండెంట్ / ప్రతివాది
టు,
కందుల లక్ష్మీ రెడ్డి అలియాస్ లక్ష్మయ్య, తండ్రి తిరుపతయ్య, వయసు 52సం, హిందూ, వ్యవసాయం, నివాసం: పెద్ద అంబర్ పేట గ్రామం, హనుమంత్ నగర్ మండలం, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ రాష్ట్రం.

దావాసమను

పై నెంబర్ దావా తేదీ : 21-11-2024దిన మీ నోటీసు కొరకు వాయిదా ఉన్నది. కావున పై నెంబరు పిటిషన్ మరియు దావా యందు మీకు ఎటువంటి ఆక్షేపణలు ఉన్న యడల తే: 21-11-2024దిన ఉదయం 10:30 గంటలకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని లేక లాయర్ గారి ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది.

// శ్రీ కోర్టు వారి ఉత్తరువుల మేరకు //
తేది :10-11-2024
వాయిదా తేదీ : 21-11-2024 ఇట్లు
ఎస్.ఎం.బాషా,
వాది తరుపు అడ్వకేట్,
పొదిలి, ప్రకాశం జిల్లా.
సెల్ : 9949435269.

EYANTRA VENTURES LIMITED
(formerly known as PUNIT COMMERCIALS LIMITED)
CIN: L72100TG1984PLC167149
Regd Office : 201, 1st Floor, SM Reddy Complex, Image Garden Road, Cyber Hills Colony, VIP Hills, Madhapur, HYDERABAD - 500081, TELANGANA. Ph. No: +91-7702974403, Email id: support@eyantraventures.com.

30 సెప్టెంబర్, 2024తో ముగిసిన త్రైమాసికం మరియు అర్ధ సంవత్సరానికి ఆడిట్‌చేయని స్టాండ్‌అలోన్ మరియు కన్సాలిడేటెడ్ ఆర్థిక ఫలితాల సారాంశం
రూ.లక్షల్లో

క్ర. సం.	వివరాలు	స్టాండ్‌అలోన్			కన్సాలిడేటెడ్		
		ముగిసిన త్రైమాసికం 30.09.2024 ఆడిట్‌చేయనివి	ముగిసిన అర్ధ సంవత్సరానికి 30.09.2024 ఆడిట్‌చేయనివి	ముగిసిన త్రైమాసికం 30.09.2023 ఆడిట్‌చేయనివి	ముగిసిన త్రైమాసికం 30.09.2024 ఆడిట్‌చేయనివి	ముగిసిన అర్ధ సంవత్సరానికి 30.09.2024 ఆడిట్‌చేయనివి	ముగిసిన త్రైమాసికం 30.09.2023 ఆడిట్‌చేయనివి
1	ఆపరేషన్ల నుండి పూర్తి ఆదాయం	635.51	1130.89	223.88	1358.67	422.81	422.81
2	కాలవ్యవధి కొరకు నికర లాభం (పన్ను మరియు మినహాయింపుగల ఐటెంలకు ముందు)	64.21	150.81	8.88	63.90	151.09	20.84
3	పన్నుకు ముందు కాలవ్యవధి కొరకు నికర లాభం (మినహాయింపుగల ఐటెంల తరువాత)	64.21	150.81	8.88	34.18	115.80	20.84
4	పన్ను తరువాత కాలవ్యవధి కొరకు నికర లాభం (మినహాయింపుగల ఐటెంల తరువాత)	34.41	115.59	6.65	34.18	115.80	15.72
5	కాలవ్యవధి కొరకు పూర్తి సమగ్ర ఆదాయం (కాలవ్యవధి కొరకు కంప్రైసింగ్ లాభం/(నష్టం) (పన్ను తరువాత) మరియు ఇతర సమగ్ర ఆదాయం (పన్ను తరువాత)	34.41	115.59	6.65	34.18	115.80	15.72
6	చెల్లించిన ఈక్విటీ వాటా మూలధనం (ముఖ విలువ రూ.1/- చొప్పున)	181.94	181.94	181.94	181.94	181.94	181.94
7	గత సంవత్సరపు బ్యాలెన్స్ షీట్‌లో చూపినట్లుగా ఇతర ఈక్విటీ (రివ్యాల్యూవేషన్ రిజర్వు మినహాయించి)	Rs.181.94 (As on 31-03-2024)			Rs. 181.94 (As on 31-03-2024)		
8	వాటా ఒక్కింటికి రాబడి (రూ.1/- చొప్పున) 1. బేసిక్	1.89	6.35	0.44	1.88	6.36	1.03
	2. డైల్యూటెడ్	1.89	6.35	0.44	1.88	6.36	1.03

గమనికలు:
1) సెబీ (లిస్టింగ్ అండ్ అధర్ డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015లోని రెగ్యులేషన్ 33 క్రింద స్టాక్ ఎక్స్చేంజీలతో దాఖలుచేయబడిన త్రైమాసికపు ఆర్థిక ఫలితాల యొక్క వివరణ్మాతక ఫార్మాట్‌కు పై పేర్కొన్నవి సారాంశం. త్రైమాసికం ఆర్థిక ఫలితాల పూర్తి వివరాలు స్టాక్ ఎక్స్చేంజ్ వెబ్‌సైట్లు అనగా బిఎస్‌ఇ లిమిటెడ్ www.bseindia.com మరియు కంపెనీ వెబ్‌సైట్: www.eyantraventures.com నందు అందుబాటు లో ఉంటాయి.
2) పై ఫలితాలు ఆడిట్ కమిటీచే సమీక్షించబడినవి మరియు సిఫారసు చేయబడినవి మరియు 11 నవంబర్, 2024న నిర్వహించిన వారి సమావేశంలో కంపెనీ యొక్క బోర్డు ఆఫ్ డైరెక్టర్లచే ఆమోదించబడినవి.

Place : Hyderabad
Date : 11-11-2024

By the order of Board
For EYANTRA VENTURES LIMITED
Sd/-
Vinita Raj Narayanam
Managing Director
DIN: 09319780

ఏడేడు లోకాల్లో యాడున్నా చట్టం వదలదు

- ఢిల్లీకి ఎందుకు కెటిఆర్..?!
- ఎవరి కాళ్లు పట్టుకునేందుకు వెళ్లారు?
- ఏ బాంబో గ్రహించే పాదాభివందనానికి వెళ్లారా?
- భవిష్యత్తులో మరిన్ని కుంభకోణాలు బయటకు..
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"ఢిల్లీ ఎందుకు వెళ్లావు కెటిఆర్... ఎవరి కాళ్లు పట్టుకునేందుకు వెళ్లారు..? రూ.55 కోట్ల ఈ-కార్ రేసు అవినీతి వ్యవహారంపై ఎసిబి విచారణకు గవర్నర్ రెండు, మూడు రోజుల్లో అనుమతి ఇచ్చే అవకాశం ఉందని వెళ్లారా" అని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి కేటీఆర్‌ను ప్రశ్నించారు. ఏ బాంబో గ్రహించే బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ పెద్దలు, అదానీ, అంబానీల కాళ్లు పట్టుకునేందుకు వెళ్లారా అని అన్నారు. ఏడేడు లోకాల్లో యాడున్నా చట్టం వదలదని హెచ్చరించారు. ఖమ్మం జిల్లా రూరల్ మండలం చిన్నవెంకటగిరి గ్రామం పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. ఇడి దాడులని, బిజెపి అని, అదానీ కాళ్లు పట్టుకున్నానని తనపై వ్యాఖ్యలు చేసిన కెటిఆర్.. ఇప్పుడు మీకు కేంద్ర పట్టాభివృద్ధి శాఖ మంత్రితో పనేంటని ప్రశ్నించారు. రూ.55 కోట్ల ఈ-కార్ రేసులో అవినీతి జరిగిందని గుర్తించి.. ఓ ప్రజాప్రతినిధిగా మిమ్మల్ని ఏసీబీ విచారణ చేయాలంటే గవర్నర్ అనుమతి ఉండాలని, 13 రోజులుగా గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్న అనుమతులు రెండు, మూడు రోజుల్లో వచ్చే అవకాశం ఉంది కాబట్టే బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ పెద్దలను ప్రసన్నం చేసుకునేందుకు వెళ్లారా అని ప్రశ్నించారు. మీ చెల్లి కేసులో ఢిల్లీ పెద్దల సహాయం పొందిన తీరుగానే మీ కేసులోనూ హడావుడిగా ఢిల్లీ పోయినట్టు తమ దగ్గర ఆధారాలు ఉన్నాయని తెలిపారు. లక్ష్మీబాంబా? తాటాకు బాంబా? తుస్సుబాంబా..? ఏ బాంబో మీకు తెలుసు కాబట్టే.. పరిణామాలను గ్రహించే ఢిల్లీ వెళ్లారని తెలుసని అన్నారు.

ఏ తప్పూ చేయనప్పుడు ఎందుకు ఉలికిపాటు..

ఏ తప్పూ చేయనప్పుడు ఎందుకు ఉలికిపాటు కేటీఆర్ అని మంత్రి పొంగులేటి ప్రశ్నించారు. ఈ-కార్ కేసులో రూ.55 కోట్లు ఖర్చు పెట్టివుంటే చట్టంలో ఏ నిబంధన ప్రకారం విదేశాలకు పంపారో చెప్పాలన్నారు. ఒప్పందం ఎంవోయూపై సంతకం అవడానికి 25 రోజుల ముందు నిబంధనలకు విరుద్ధంగా రూ.55 కోట్లు ఎందుకు విదేశాలకు పంపారో చెప్పాలని నిలదీశారు. ఇన్‌డైరెక్టుగా మీ తొత్తు సంస్థలకు లబ్ధి చేకూర్చేందుకేనా అని అన్నారు. దీనికి కేబినెట్‌ది గానీ, జీహెచ్‌ఎంసీ అప్రూవల్ గానీ ఉందా అని ప్రశ్నించారు. ఆర్‌బిఐ గవర్నర్ అనుమతి లేకుండా విదేశాలకు ఎలా పంపారో చెప్పాలన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ఎవర్నీ ఉద్దేశపూర్వకంగా దెబ్బతీసేది ఉండదని, పేదలను అగౌరవపరిస్తే మాత్రం సహించేది లేదన్నారు. ఈ-కారు రేసు కేసుకే ఇంత హైరానా పడితే విద్యుత్ కొనుగోళ్లు, కాళేశ్వరం, ఐఅండ్‌పీఆర్ అంశాలు ఒక్కొక్కటీ ప్రజల ముందు బయటపెడితే అంతరిక్షంలో దాక్కుంటారనిపిస్తుందని తెలిపారు. పేదల సొమ్మును కొల్లగొడితే మాత్రం చట్టం తనపని తాను చేసుకుంటూ పోతుందన్నారు. ఫోన్ ట్యాపింగ్ చిన్న విషయం కాదని తెలిపారు. ఖమ్మంలోని డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్ల అవకతవకలపైనా విచారణ నిర్వహిస్తామన్నారు. ఇటీవల పెయిడ్ ఆర్టిస్టులను పార్టీలో చేర్చుకునేటప్పుడు మాజీ సిఎం కెసిఆర్ చేసిన వ్యాఖ్యలు నవ్వొచ్చేలా ఉన్నాయన్నారు. 8వ వింత అని చెప్పిన కాళేశ్వరంతో.. ఎవరు లబ్ధి పొందారో.. కూలిపోవడానికి కారకులు ఎవరో చెప్పాలన్నారు. ఈ సమావేశంలో మద్దులపల్లి మార్కెట్ కమిటీ ఛైర్మన్ బైరు హరినాథబాబు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, నాయకులు తుంబూరు దయాకర్‌రెడ్డి, బొర్రా రాజశేఖర్, మద్దినేని స్వర్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

పస్తులతో ఉన్నా పట్టించుకోరా..

- ఆకలికేక దీక్షకు టిఎజిఎస్ మద్దతు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మంత్రులు, ఎమ్మెల్యేలు నెలనెలా లక్షల్లో జీతాలు తీసుకుంటుంటే.. గిరిజన కార్మికులు మాత్రం పస్తులతో ఉంటున్నారని, అయినా వారిని పట్టించుకోవడం లేదని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టిఎజిఎస్) భద్రాచలం పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు సోయం జోగరావు, కుంజా శ్రీను ఆగ్రహం వ్యక్తం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం పిఎంహెచ్ హాస్టల్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ బకాయివేతనాల కోసం ఐటిడిఎ ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో చేస్తున్న ఆకలికేక దీక్షలు 5వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షకు టీఏజీఎస్ నాయకులు మద్దతు తెలిపి మాట్లాడారు. ఐటీడీఏ అధికారులు గిరిజన కార్మికుల సమస్యలపై స్పందించకపోవటం బాధాకరమన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ అధికారులకు జీతాలు ఇవ్వటానికి డబ్బులున్నాయి గానీ 22 నెలలుగా గిరిజన కార్మికులకు జీతాలు ఇవ్వటానికి డబ్బులు ఎందుకు కేటాయించటం లేదని ప్రశ్నించారు. జులై నెల నుంచి వేతనాల చెక్కును ఆర్థిక శాఖలో ఎందుకు పెండింగ్‌లో ఉంచుతున్నారని నిలదీశారు. ఇది ప్రజా పాలనా లేక పస్తుల పాలనా అర్థంకాని పరిస్థితి రాష్ట్రంలో ఉందన్నారు. బకాయివేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉండి కూడా వేతనాలు ఎందుకు ఇప్పించలేక పోతున్నారని ప్రశ్నించారు. ఆకలికేక దీక్షల డిమాండ్స్ పరిష్కారం చేయాలని, లేదంటే పోరాటం మరింత తీవ్రతరం చేస్తామని సీఐటీయూ పట్టణ నాయకులు యన్.నాగరాజు డిమాండ్ చేశారు. 15వతేదీ తర్వాత సమ్మె చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా కార్యదర్శి హీరాలాల్, నాయకులు లక్ష్మి, మున్నా, భద్రమ్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం కుమురంభీం -ఆసిఫాబాద్ జిల్లా కార్యదర్శిగా కూశన రాజన్న

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిపిఎం కుమురంభీం - ఆసిఫాబాద్ జిల్లా కార్యదర్శిగా కూశన రాజన్న ఎన్నికయ్యారు. ఈ నెల 9, 10, 11 తేదీల్లో కాగజ్‌నగర్‌లో జిల్లా మూడో మహాసభ జరిగింది. ఈ సందర్భంగా జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. కూశన రాజన్నను జిల్లా కార్యదర్శిగా మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా కోట శ్రీనివాస్, దుర్గం దినకర్, జిల్లా కమిటీ సభ్యులుగా ముంజం ఆనంద్‌కుమార్, ముంజం శ్రీనివాస్, జె.రాజేందర్, అనిత, శారద, నేర్పల్లి అశోక్, దిగిడ బక్కన్న, చాపిలె సాయికృష్ణ, కొరెంగ మాలాశ్రీ, గెడం టీకానంద్‌తోపాటు కో ఆప్షన్ సభ్యున్ని ఎన్నుకున్నట్టు సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా ఇన్‌చార్జి బండారు రవికుమార్ తెలిపారు.

అడ్డా247తో యాక్సిస్ బ్యాంక్ ఒప్పందం

ప్రజాశక్తి - హైదరాబాద్

నైపుణ్యాల పెంపునకు గాను అడ్డా247తో ప్రముఖ ప్రయివేటు రంగ విత్త సంస్థ యాక్సిస్ బ్యాంక్ ఒప్పందం కుదుర్చుకుంది. ఇది మెరుగైన నైపుణ్యం ఉన్న వారికి యాక్సిస్ బ్యాంకులో సేల్స్, రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్‌లో ఉద్యోగులను తీసుకోవడానికి అదే విధంగా తర్వాతి తరం నైపుణ్యం కలిగిన బ్యాంకర్లను నియమించుకోవడానికి ఉపయోగపడుతుందని ఆ బ్యాంక్ వర్గాలు తెలిపాయి. బ్యాంకింగ్ రంగంలో ప్రదానమైన విక్రయాలు, సేవల విభాగంలో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించడంతో పాటు రాణించడానికి దోహదం చేయనుందని తెలిపింది. తమ సంస్థ బ్యాంకింగ్ రంగంలో మానవ వనరులను అందించడానికి ఏర్పాటు చేయబడిందని అడ్డా 247 వ్యవస్థాపకుడు, సిఇఒ అనిల్ నగర్ పేర్కొన్నారు.

రఘువంశీ గ్రూపు చేతికి బ్రిటన్ కంపెనీ

ప్రజాశక్తి - హైదరాబాద్

బోయింగ్, జిఇ ఏవియేషన్, హనీవెల్, రోల్స్ రాయిస్, కాలిన్స్ ఏరోస్పేస్, వంటి అంతర్జాతీయ సంస్థలకు అత్యంత కీలకమైన పరికరాలను సరఫరా చేసే హైదరాబాద్‌కు చెందిన రఘు వంశీ గ్రూప్ బ్రిటన్ కంపెనీని స్వాధీనం చేసుకున్నట్లు ప్రకటించింది. ఆయిల్ అండ్ గ్యాస్ పరిశ్రమకు విడిభాగాల్లో ప్రత్యేకత కలిగిన ప్రముఖ ప్రెసిషన్ మెషినింగ్ కంపెనీ పిఎంసి గ్రూపును 100 శాతం కొనుగోలు చేసినట్లు సోమవారం వెల్లడించింది. ఈ కొనుగోలు ప్రకటన కార్యక్రమానికి భారత్‌లో యుకె డిప్యూటీ హైకమిషనర్ గారెత్ వైన్ ఓవెన్, తెలంగాణ పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, తెలంగాణ ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ డైరెక్టర్ ప్రవీణ్ పిఎ, మిధాని సిఎండి ఎస్‌కె ఝా, ఎఆర్‌సిఐ శాస్త్రవేత్త డాక్టర్ ఎల్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ స్వాధీనం అంతర్జాతీయంగా విస్తరించడానికి, తన సామర్థ్యాలను విస్తరించడానికి రఘు వంశీ గ్రూపు ముందడుగుకు దోహదం చేయనుందని రఘువంశీ గ్రూపు ఎండి వంశీ వికాస్ తెలిపారు.

21న ఒప్పో ఫైండ్ ఎక్స్8 సిరీస్ విడుదల

న్యూఢిల్లీ : ప్రముఖ స్మార్ట్‌ఫోన్ల తయారీ కంపెనీ ఒప్పో తన నూతన ఫైండ్ ఎక్స్8 సిరీస్‌ను నవంబర్ 21న గ్లోబల్ మార్కెట్‌లోకి విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. ఇండోనేషియాలోని బలిలో ఫైండ్ ఎక్స్8, ఫైండ్‌ఎక్స్ 8 ప్రోను ఆవిష్కరించనున్నట్లు తెలిపింది. ఫైండ్ ఎక్స్‌ను 5,630 ఎంఎహెచ్ సిలికాన్ కార్బన్ బ్యాటరీ, ప్రోను 5,910 ఎంఎహెచ్ సిలికాన్ కార్బన్ బ్యాటరీతో అందుబాటులోకి తెస్తోంది.

కులగణన వ్యతిరేకిస్తే కెటిఆర్‌కు పుట్టగతులుండవు

- లింగం యాదవ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కులగణన వ్యతిరేకిస్తే బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటీఆర్‌కు పుట్టగతులుండవని టిపిసిసి అధికార ప్రతినిధి లింగం యాదవ్ హెచ్చరించారు. సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. దేశంలోనే చారిత్రాత్మకమైన కులగణన సర్వే తెలంగాణలో జరుగుతున్నదని తెలిపారు. బిసి రిజర్వేషన్ తగ్గించినప్పుడు కెటిఆర్ మంత్రిగా ఉండి ఏం చేశారని ప్రశ్నించారు. సామాజిక అసమానతలు పోవాలనీ, జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ ఉండాలని కులగణన సర్వే ప్రభుత్వం చేపట్టిందని స్పష్టం చేశారు. మోడీ ఒబిసి అని ప్రచారం చేసుకుంటున్నారు కదా.. ఎందుకు దేశ వ్యాప్తంగా కుల గణన చేయడం లేదని ప్రశ్నించారు.

కెటిఆర్‌కు బిసిల గురించి మాట్లాడే అర్హత లేదు

- మీ పదవులను బిసి, ఎస్‌సిలకు ఇచ్చి మాట్లాడండి
- రాష్ట్ర అభివృద్ధికి ప్రణాళిక కుటుంబ సర్వే
- మంత్రి పొన్నం ప్రభాకర్

వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో గోవును తీసుకెళ్తున్న మంత్రి పొన్నం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిసిల గురించి మాట్లాడే అర్హత కెటిఆర్‌కు లేదని, మీ పార్టీ అధ్యక్ష పదవి, కార్యనిర్వాహక పదవి, ప్రతిపక్ష పదవిని బిసిలకు, ఎస్‌సిలకు ఇచ్చి మాట్లాడాలని రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో శ్రీ రాజరాజేశ్వరస్వామిని ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మాజీ మంత్రి కనుమూరి బాపిరాజుతో కలిసి మంత్రి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు ప్రతి తెలంగాణ పౌరుడూ సహకరించాలని ప్రభుత్వం పక్షాన విజ్ఞప్తి చేస్తున్నా అన్నారు. ఇది ఎవరినీ ఇబ్బంది పెట్టేందుకు కాదని, బలహీన వర్గాలకు మాత్రమే పరిమితమైంది కాదు, రాష్ట్ర అభివృద్ధి ప్రణాళిక దిక్సూచి అవసరాల కోసం తీసుకుంటున్న సమాచారం అని వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఏం చేసిందని కెటిఆర్ అంటున్నారు.. అసలు బిసిల గురించి మాట్లాడే అర్హత కెటిఆర్‌కు ఉందా అని ప్రశ్నించారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు అన్యాయం చేసిన వారికి మాట్లాడే అర్హత ఎక్కడిది అని అన్నారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో జరుగుతున్న ఈ కుల సర్వే దేశవ్యాప్తంగా జరగాలన్న డిమాండ్ వస్తోందని తెలిపారు. ప్రజల స్థితిగతులు తెలవడానికి ప్రభుత్వం సమాచారం సేకరిస్తుంది. ఎలాంటి అనుమానాలూ అవసరం లేదని చెప్పారు. ఆయన వెంట ఆలయ ఈవో వినోద్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు చంద్రగిరి శ్రీనివాస్‌గౌడ్, పిల్లి కనకయ్య, వస్తాది కృష్ణ ప్రసాద్‌గౌడ్, చిలక రమేష్ ఉన్నారు.

కెటిఆర్‌కు ఢిల్లీలో ఏం పని? : ప్రభుత్వ విప్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కెటిఆర్‌కు ఢిల్లీలో ఏం పని? ఆయన్ను ఢిల్లీకి పిలిచిందెవరు? అని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రశ్నించారు. అమృత్ టెండర్ల పైన ఫిర్యాదు చేయడానికి ఏముంది..? స్వయంగా బిఆర్‌ఎస్ పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డినే ఎలాంటి అవినీతి లేదని తేల్చి చెప్పారని గుర్తుచేశారు. అమృత్ టెండర్ల పైన కేటీఆర్‌కు అవగాహన విమర్శించారు. రూ.8,888 వేల కోట్ల కుంభకోణం అని నోటికొచ్చినట్లు వాగి లీగల్ నోటీసులు తెప్పించుకున్నారని ఎద్దేవా చేశారు. అసలు టెండర్ రూ.3,500 కోట్లు అయితే ఇష్టానుసారంగా మాట్లాడి పరువు తీసుకున్నారని తెలిపారు. కేంద్రానికి కంటే ముందు బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే కందాలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అమృత్ పేరుతో ఢిల్లీ లో బిజెపి నేతల కాళ్లు మొక్కడానికి వెళ్తున్నారని ఆరోపించారు. ఫార్ములా ఈ వ్యవహారం నుంచి బయట పడటానికే కెటిఆర్ ఢిల్లీ ప్రయాణమని విమర్శించారు. రాష్ట్ర గవర్నర్ ఎఫ్‌ఐఆర్‌కు అనుమతి ఇస్తారన్న భయంతోనే కెటిఆర్ హడావిడిగా ఢిల్లీకి వెళ్లారని తెలిపారు. కేటీఆర్ ఎన్ని ప్రయత్నాలు చేసినా ఉపయోగం లేదనీ, అడ్డగోలుగా ఇచ్చిన నిధులకు లెక్క చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు. ఫార్ములా ఈ, కాళేశ్వరం లాంటి కుంభకోణాల నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నాల చేస్తున్నారని చెప్పారు. బతుకమ్మ చీరల పేరిట సిరిసిల్ల నేతన్నల బతుకులను కేసీఆర్ ఆగం చేస్తే బకాయిలను కాంగ్రెస్ సర్కారు తీర్చిందని తెలిపారు.

స్క్రాప్ గోదాముల్లో అగ్నిప్రమాదం

- భారీగా ఆస్తి నష్టం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రెండు స్క్రాప్ గోదాముల్లో అగ్ని ప్రమాదం సంభవించిన ఘటన రంగారెడ్డి జిల్లా అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆరాంఘర్ స్క్రాప్ గోదాంలో మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో మంటలు వ్యాపించాయి. క్షణాల్లో గోదాం మొత్తం పూర్తిగా మంటలు వ్యాపించి ఆ ప్రాంతం మొత్తం దట్టమైన పొగ ఆలుముకుంది. గోదాం పక్కనే జాతీయ రహదారి ఉండటంతో వాహనదారులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వెంటనే స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించగా ఘటనా స్థలానికి చేరుకున్న సిబ్బంది సుమారు ఐదు గంటలు కష్టపడి మంటలను అదుపులోకి తెచ్చారు. గోదాంలో ఉన్న స్క్రాప్ భారీగా అగ్నికి అహుతయింది. ఇదే గోదాంలో ఐదు నెలల క్రితం అగ్ని ప్రమాదం జరిగి భారీగా ఆస్తి నష్టం జరిగింది. అదే విధంగా అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎంఎం పహాడీలో మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతాల్లో స్క్రాప్ గోదాంలో మంటలు వ్యాపించాయి. వెంటనే స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించగా సుమారు నాలుగు గంటలు కష్టపడి రెండు ఫైర్ ఇంజన్ల సాయంతో మంటలను అదుపులోకి తెచ్చారు. నివాస ప్రాంతాల్లో ఈ అగ్ని ప్రమాదం సంభవిం చడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఈ రెండు అగ్ని ప్రమాద సంఘటనలో భారీగా ఆస్తి నష్టం సంభవించిందని పోలీసులు స్పష్టం చేశారు. అయితే, అగ్ని ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

పొదుపు కోసం గులక్ సేవింగ్ ఎకౌంట్

- ప్రతి నెల కొత్తగా 300 మర్చంట్ భాగస్వాముల నమోదు
- ఫినో పేమెంట్స్ బ్యాంక్ జోనల్ హెడ్ వెల్లడి

హైదరాబాద్ : ఖాతాదారులతో పొదుపు చేయించడమే లక్ష్యంగా సేవింగ్ అకౌంట్ 'గులక్' ప్రారంభించినట్లు ఫినో పేమెంట్స్ బ్యాంక్ జోనల్ హెడ్ మహ్మద్ ఇనాయతుల్లా తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాల్లోని 60వేల పైగా ఫినో బ్యాంక్ మర్చంట్ పాయింట్లలో కేవలం 15 నిమిషాల్లోనే ఈ సేవింగ్ ఖాతాను, డెబిట్ కార్డును పొందవచ్చన్నారు. ఇందులో ఖాతాదారులు వార్షిక ప్లాన్ రుసుం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. కొన్ని ప్రమాణాలకు అనుగుణంగా కనీస ఖాతా బ్యాలెన్స్ మాఫీ కూడా ఉందన్నారు. ఈ ఖాతాలో ఏడాదికి 7.75 శాతం ఆకర్షణీయ వడ్డీ రేటు లభిస్తుందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రతీ నెల కొత్తగా 300-500 మర్చంట్ పాయింట్లను అందుబాటులోకి తెస్తున్నామన్నారు. ఈ రీజియన్‌లో 6.3 లక్షల పైగా ఖాతాదారులున్నారన్నారు. నెలకు రూ.250-300 కోట్ల మేర వ్యాపారం జరుగుతుందన్నారు.

ఒఎన్‌జిసికి బంపర్ లాభాలు

- క్యూ2లో రూ.11,984 కోట్లు
- ప్రతీ షేర్‌పై రూ.6 డివిడెండ్

ముంబయి : దేశంలోనే అతిపెద్ద చమురు ఉత్పత్తి కంపెనీ, ప్రభుత్వ రంగంలోని ఒఎన్‌జిసి ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో 17 శాతం వృద్ధితో రూ.11,984 కోట్ల నికర లాభాలు సాధించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.10,238 కోట్ల లాభాలు నమోదు చేసింది. అదే సమయంలో రూ.35,163 కోట్లుగా ఉన్న రెవెన్యూ.. గడిచిన క్యూ2లో 4 శాతం తగ్గి రూ.33,881 కోట్లుగా ప్రకటించింది. సోమవారం జరిగిన కంపెనీ బోర్డు సమావేశంలో ఇన్వెస్టర్లకు డివిడెండ్‌ను అందించాలని నిర్ణయించారు. ఆర్థిక సంవత్సరం 2024-25గాను మధ్యంతర డివిడెండ్ కింద ప్రతీ రూ.5 ముఖ విలువ కలిగిన షేర్‌పై రూ.6 చెల్లించడానికి ఆ కంపెనీ బోర్డు ఆమోదం తెలిపింది. దీని రికార్డ్ తేదిని నవంబర్ 20గా ప్రకటించింది. సోమవారం ఎన్‌ఎస్‌ఇలో ఒఎన్‌జిసి షేర్ విలువ 2.02 శాతం తగ్గి రూ.257.25 వద్ద ముగిసింది.

తగ్గిన బిఒఐ ఎన్‌పిఎలు

ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ ఇండియా (బిఒఐ) 2024 సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో 63 శాతం వృద్ధితో రూ.2,374 కోట్ల నికర లాభాలు సాధించింది. వడ్డీయేతర ఆదాయం పెరగడంతో మెరుగైన ఫలితాలు ప్రకటించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.1,458 కోట్ల లాభాలు నమోదు చేసింది. 2023 సెప్టెంబర్ ముగింపు నాటికి బిఒఐ స్థూల నిరర్థక ఆస్తులు 5.84 శాతంగా ఉండగా.. గడిచిన క్యూ2 ముగింపు నాటికి 143 బేసిస్ పాయింట్లు మెరుగు పడి 4.41 శాతానికి తగ్గాయి. నికర నిరర్థక ఆస్తులు 1.54 శాతం నుంచి 0.94 శాతానికి దిగివచ్చాయి. క్రితం క్యూ2లో బ్యాంక్ మొత్తం ఆదాయం రూ.19,872 కోట్లకు పెరిగింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.16,659 కోట్ల ఆదాయం చోటు చేసుకుంది. క్రితం క్యూ2లో నికర వడ్డీ ఆదాయం 4 శాతం వృద్ధితో రూ.5,986 కోట్లుగా.. వడ్డీయేతర ఆదాయం 49 శాతం ఎగిసి రూ.2,518 కోట్లకు చేరింది.

నెప్రో కేర్‌కు రూ.2.19 కోట్ల లాభాలు

వైద్య రంగంలోని నెప్రో కేర్ ఇండియా లిమిటెడ్ 2024 సెప్టెంబర్‌తో ముగిసిన ప్రథమార్థం (హెచ్1)లో 2.19 కోట్ల నికర లాభాలు నమోదు చేసింది. ఎన్‌ఎస్‌ఇలోని ఎస్‌ఎంఇ వేదికలో లిస్టింగ్ అయినా ఈ సంస్థ రెవెన్యూ 17.69 కోట్లుగా చోటు చేసుకుంది. తాము కొత్తగా ఏర్పాటు చేసిన యూనిట్ల ద్వారా వచ్చే త్రైమాసికాల్లో తమ రెవెన్యూ మరింత పెరుగనుందని నెప్రో కేర్ ఇండియా ఎండి, సిఇఒ ప్రతిమ్ సేన్‌గుప్తా పేర్కొన్నారు.

ఫిబ్రవరిలో వడ్డీ రేట్లు తగ్గొచ్చు

- ఎస్‌బిఐ ఛైర్మన్ సిఎస్ శెట్టి అంచనా

ముంబయి : రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) వచ్చే 2025 ఫిబ్రవరిలో వడ్డీ రేట్లను తగ్గించే అవకాశం ఉందని ఎస్‌బిఐ ఛైర్మన్ సిఎస్ శెట్టి అంచనా వేశారు. అది కూడా 25 బేసిస్ పాయింట్లు (పావు) శాతం మేర కోత పెట్టొచ్చని పేర్కొన్నారు. అప్పటి వరకు రిటైల్ రుణ గ్రహీతలు వేచి చూడాల్సిందేనని అన్నారు. డిపాజిట్లపైనా వడ్డీ రేట్లు హెచ్చు స్థాయికి చేరి ఉన్నాయన్నారు. రుణాలపై ఆర్‌బిఐ వడ్డీ రేట్లను తగ్గించినప్పటికీ ఆ ప్రభావం బ్యాంక్‌లపై తక్కువగాను ఉండొచ్చన్నారు

డైమ్లర్ ఇండియా ప్రెసిడెంట్‌గా మైఖేల్ మోబియస్

న్యూఢిల్లీ : ప్రముఖ వాణిజ్య వాహన తయారీదారు డైమ్లర్ ఇండియా నూతన ప్రెసిడెంట్, చీఫ్ ప్రొక్యూర్‌మెంట్ అండ్ సప్లయి చైన్ ఆఫీసర్‌గా మైఖేల్ మోబియస్‌ను నియమించింది. ఆయన నియామకం నవంబర్ 1 నుంచి అమల్లోకి వచ్చిందని తెలిపింది. ముత్తు మారుతాచలం సి స్థానంలో మైఖేల్ బాధ్యతలను చేపడుతున్నారని పేర్కొంది. మైఖేల్‌కు ఈ రంగంలో 30 ఏళ్ల అనుభవం ఉందని వెల్లడించింది.

భాన్జుకు రూ.140 కోట్ల నిధులు

హైదరాబాద్ : గణిత ఎడ్‌టెక్ సంస్థ బాన్జు తాజాగా 16.5 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.140 కోట్లు) నిధులు సమీకరించినట్లు ప్రకటించింది. కొత్త నిధులతో తమ వేదికను భారత్‌లో విస్తరించడం సహా అమెరికా, బ్రిటన్, మధ్య ఈశాన్య దేశాలల్లోకి ప్రవేశించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఆ సంస్థ తెలిపింది. వచ్చే ఐదేళ్లలో 10 కోట్ల విద్యార్థులను చేరుకోవడానికి ఈ పెట్టుబడి సహాయం చేస్తుందని భాన్జు వ్యవస్థాపకుడు, సిఇఒ నీలకంఠ భాను తెలిపారు.

ఏం చేయాలో మీరే చెప్పండి

- 3 నెలల్లో వస్తా.. మైక్రో లెవెల్‌లో రివ్యూ చేస్తా
- కేంద్ర మంత్రి బండి సంజయ్
- సంపూర్ణతా అభియాన్' అమలు తీరుపై సమీక్ష

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'సంపూర్ణతా అభియాన్' కార్యక్రమాల అమలులో ములుగు, భూపాలపల్లి జిల్లాలు రాబోయే కాలంలో నెంబర్-1 ర్యాంకు సాధించాలంటే ఏం చేయాలో మీరే చెప్పండి అని, మళ్లీ మూడు నెలల్లో తాను వస్తానని, మైక్రో లెవల్‌లో రివ్యూ చేస్తానని, ఏమైనా లోపాలుంటే అధిగమించేలా చూడాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. సోమవారం 'సంపూర్ణతా అభియాన్' కార్యక్రమాల అమలు తీరుపై సమీక్షించేందుకు ఆయన ములుగు జిల్లాకు వచ్చారు. ములుగు ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌కు చేరుకున్న బండి సంజయ్‌కు జిల్లా కలెక్టర్ దివాకరతోపాటు జిల్లా ఉన్నతాధికారులంతా ఘన స్వాగతం పలికారు. అనంతరం జిల్లా పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అక్కడి నుంచి కలెక్టరేట్‌కు వెళ్లి సంపూర్ణతా అభియాన్ కార్యక్రమాల అమలు తీరును పర్యవేక్షించారు. ఆస్పిరేషనల్ బ్లాక్‌గా ఎంపికైన కన్నాయిగూడెంలో విద్య, వైద్యం, ఆర్థిక ప్రగతికి సంబంధించి గత మూడు నెలలుగా అమలవుతున్న కార్యక్రమాలపై ఒక్కొక్కటిగా ఆరా తీశారు. కన్నాయిగూడెం మండలంలో గర్భిణులకు అందించిన సేవలపై ఆరా తీశారు. అలాగే జిల్లాలో రైతు పంట సాగు, సమస్యలపై వ్యవసాయశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే మహిళా పొదుపు సంఘాల పనితీరుపై అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రం నుంచి తెప్పించిన నివేదికలో కన్నాయిగూడెంలోని పొదుపు సంఘాలకు నయాపైసా కూడా ఇవ్వలేదని ఉందని, మీరేమో అందరికీ ఇచ్చారని చెబుతున్నారని, ఇదేలా సాధ్యమని ప్రశ్నించారు. కంప్యూటర్ మిస్టేక్ పడిందని, సరిచేస్తామని అధికారులు తెలిపారు.

మహబూబ్‌నగర్ అభివృద్ధి విషయంలో సిఎం అబద్ధాలు

- మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహబూబ్‌నగర్ అభివృద్ధికి బిఆర్‌ఎస్ ఏమీ చేయలేదంటూ సిఎం రేవంత్‌రెడ్డి అబద్ధాలాడారని మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల్ల వెంకటేశ్వర్ రెడ్డి, పట్నం నరేందర్ రెడ్డి, డాక్టర్ ఆంజనేయ గౌడ్, కురువ విజయ్ కుమార్ తో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ మహబూబ్‌నగర్ జిల్లాలో ఐదు మెడికల్ కాలేజీల నిర్మించారనీ, పెండింగ్ ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చారనీ, ఇంటింటికి నల్లా నీళ్లిచ్చి తాగునీటి ఎద్దడిని తొలగించారని గుర్తుచేశారు. అమర్ రాజా కంపెనీ మహబూబ్‌నగర్ జిల్లాకు వచ్చింది కూడా బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం దళితులకు అన్యాయం చేస్తున్నదని బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు.

కులగణనను బిజెపి ఎందుకు వ్యతిరేకిస్తోంది?

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కులగణనను బిజెపి ఎందుకు వ్యతిరేకిస్తుంది? అని ప్రొఫెసర్ మురళీ మనోహర్ ప్రశ్నించారు. సోమవారం గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కులగణనన వ్యతిరేకించే వారంతా దేశద్రోహులను విమర్శించారు. వారంతా దేశాన్ని విడగొట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. గత పదేళ్లుగా అనేక వృత్తులపై అధ్యయనం చేయని బిజెపి, ఏ గణాంకాల ఆధారంగా ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు రూపొందిం చిందో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజలు స్వచ్ఛందంగా కుల గణనకు సహకరించాలని కోరారు. కులగణన విజయవంతమైతే తెలంగాణ అభివృద్ధి పథంలో నడుస్తుందని తెలిపారు.ప్రొఫెసర్ సమ్మయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ఇస్తున్న అభివృద్ధి ఫలాలు ప్రతి ఒక్కరికి అందాలంటే కులగణన అవసరమని తెలిపారు. కులగణనకు ప్రజలు సహకరించాలని నియోజకవర్గాల వారీగా పర్యటించనున్నట్టు చెప్పారు.

మారుతి సుజుకి కొత్త డిజైర్ విడుదల

న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ కంపెనీ మారుతి సుజుకి సరికొత్త డిజైర్ 2024ను విడుదల చేసింది. నాలుగోతరం డిజైన్‌తో పాటు ఫీచర్లు, ఇంజిన్‌లోనూ పలు మార్పులు చేసినట్లు ఆ కంపెనీ వెల్లడించింది. ఎక్స్‌షోరూం వద్ద దీని ప్రారంభ ధరను రూ.6.79 లక్షలుగా నిర్ణయించింది. మారుతి సుజుకిలో 5 స్టార్ రేటింగ్ పొందిన తొలి కారు ఇదే కావడం విశేషం. ఆరు ఎయిర్ బ్యాగ్‌లు, మారుతీ జెడ్ సిరీస్ 1.2 లీటర్ త్రీ సిలిండర్ పెట్రోల్ ఇంజిన్‌ను అమర్చింది. మాన్యువల్ వేరియంట్‌లో లీటర్‌కు 24.79 కిలోమీటర్ల మైలేజీ, ఎఎంటి వేరియంట్ లీటర్‌కు 25.71 కిలోమీటర్లు మైలేజీ ఇస్తుందని ఆ కంపెనీ పేర్కొంది.